క్లుప్తంగా

27 అడుగుల ఆంజనేయుడు



సిలగాంలో ఆంజనేయస్వామి విగ్రహం

గార గార మండలం వమరవిల్లి పరిధి సిలగాం గ్రామ సమీపంలో 27 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన బుధవారం ఘనంగా జరిగింది. తల్లి రెయ్యి మంగమ్మ పేరిట ఇద్దరు కుమారులు వంశీ, పవన్‌లు ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేయించారు. స్థానికులు వేదూరి రామిరెడ్డి దంపతులు పూజలు నిర్వహించగా, మధ్యాహ్నం రెండు వేల మందికి అన్నదానం జరిగింది.

సీసీ కెమెరాలు తప్పనిసరి



జల్లపేట వద్ద సీసీ కెమెరాల ఏర్పాటును పరిశీలిస్తున్న ఎస్‌ఐ

గార : దేవాలయాలు, చర్చిలు వద్ద అన్యమత వ్యాఖ్యలు రాస్తున్న నేపథ్యంలో పోలీసుల సూచనలతో సీసీ కెమెరాలు ఏర్పాటు ముమ్మరంగా సాగుతోంది. ఇటీవల అంపోలు చర్చి వద్ద ఏర్పాటు చేయగా, బుధవారం జల్లపేట వద్ద చర్చిలో సీసీ కెమెరాలు అమర్చారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ ఆర్.జనార్దనరావు మాట్లాడుతూ దేవాలయాలు, చర్చిలు వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిర్వాహకులు, ఆలయ కమిటీ సభ్యులు సహకరించాలని కోరారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం



మొదలవలస కృష్ణవేణి

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియెట్ కోర్సుల్లో ప్రవేశాలకు టెన్త్‌క్లాస్ పరీక్షలు రాసిన విద్యార్థినుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ మొదలవలస కృష్ణవేణి తెలిపారు. బుధవారం కళాశాలలో ఆమె మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ప్రఖ్యాతిగాంచిన ఈ కళాశాలలో జనరల్ కోర్సుల్లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, ఒకేషనల్ కోర్సులైన ఎంఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ, సీఎస్‌ఈ కోర్సుల్లో అడ్మిషన్లు చేపడుతున్నట్టు వివరించారు. పదో తరగతి పరీక్షలు రాసిన బాలికలు నిర్దేశిత ఫీజులతో హాల్‌టిక్కెట్, ఆధార్‌కార్డుతో హాజరై ప్రవేశాలు పొందవచ్చని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.


పారిశుద్ధ్యంపై దృష్టిపెట్టాలి



చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో భారతీ సౌజన్య

ఎచ్చెర్ల క్యాంపస్: పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా పంచాయతీ అధికారి భారతి సౌజన్య అన్నారు. చిలకపాలెంలో పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. ఈ నెల 1న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గ్రామాన్ని సందర్శించి పారిశుద్ధ్యం నిర్వహణ, చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రం పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ ఆదేశాలపై ఆర్డీవో సాయిప్రత్యూష సైతం గ్రామాన్ని సందర్శించారు. డీపీవో క్షేత్రస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేయడంతో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టిపెట్టారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



చెత్త సేకరణ ట్రాక్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

జి.సిగడాం: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నమస్తే ఎచ్చెర్ల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. బుధవారం జి.సిగడాం మండలం గెద్దకంచరాం పంచాయతీలో సచివాలయం, సీసీ రోడ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ పంచిరెడ్డి లలితాకుమారి, నాయకులు పంచిరెడ్డి శ్యామలరావు, న్యాయవాది నక్క మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు అందేనా?

- జి.సిగడాం మండల రైతులకు తప్పని పాట్లు
- తోటపల్లి, మడ్డువలస ప్రాజెక్టుల ద్వారా అందని నీరు
- ఈ ఖరీఫ్‌కైనా నీరు అందించాలని వేడుకోలు



దేవరవలసలో సాగుభూముల చెంతన బాగా లోతులో ఉన్న కాలువ

జి.సిగడాం : అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా మారింది జి.సిగడాం మండలంలోని పలు గ్రామాల పరిధిలోని రైతులు పరిస్థితి. తోటపల్లి, మడ్డువలస వంటి ప్రాజెక్టులు ఉన్నా చుక్కనీరు కూడా అందక ఏటా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాలకులు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా సాగునీటి సమస్య మాత్రం పరిష్కారం కాకపోవడంతో నిరాశ చెందుతున్నారు. రికార్డుల ప్రకారం తోటపల్లి సాగునీరు జి. సిగడాం మండలంలోని ఆయకట్టు భూములకు చేరాలి. అయితే క్షేత్రస్థాయిలో నడిమివలస, చెట్టుపొదిలాం, వెలగాడ, చంద్రయ్యపేట, దేవరవలస, మంగమ్మపేట తదితర గ్రామాలకు చుక్క నీరు కూడా రావడంలేదు. అలాగే, మడ్డువలస కాలువ ద్వారా వాండ్రంగి, ఆనందపురం, సంతవురిటి, దవలపేట గ్రామాలకు నీరు అందాల్సి ఉన్నా పిల్ల కాలువలు ఏర్పాటు చేయకపోవడంతో నీటి కోసం ఏటా ఎదురుచూపులే మిగులుతున్నాయి.

56 అడుగుల లోతులో కాలువ..

దేవరవలస, మంగమ్మపేట, వాండ్రంకి, బొట్లుపేట తదితర గ్రామాల పరిధిలో మడ్డువలస కాలువ 56 అడుగుల లోతులో ఉంది. ఫలితంగా పక్కనే నీరు ఉన్నా వినియోగించడానికి వీలు లేని పరిస్థితి. ఇంజినీరింగ్ అధికారుల ప్లానింగ్ వైఫల్యమే ఈ పరిస్థితికి కారణమని రైతులు చెబుతున్నారు. నీరు అందక సుమారు 800 ఎకరాల భూములకు నష్టం కలుగుతోంది. మడ్డువలస విస్తరణ, ఆధునీకీకరణ పనులు రైతులకు కలగానే మిగిలాయి.

ఇది మడ్డువలస లెక్క..

మడ్డువలస ప్రధాన కుడికాలువ ద్వారా జి.సిగడాం మండలంలో 5200 ఎకరాల పరిధిలో సాగునీటి కాలువ ఉంది. పలుచోట్ల పిల్లకాలువలు లేకపోవడంతో నీరు ఆయకట్టుకు అందడం లేదు. రెండో విడతలో 6500 ఎకరాలకు సాగునీరు అందించేందుకు కాలువను విస్తరించాల్సి ఉంది. మండలంలో నాగులవలస వద్ద ప్రారంభమైన ఈ కాలువ 16 గ్రామాల మీదుగా నల్లిపేట చెరువు వరకూ విస్తరించి ఉంది. నల్లిపేట నుంచి కప్పరాం, దేవరవలస, మంగమ్మపేట మీదుగా లావేరు మండలానికి కాలువను విస్తరించాల్సి ఉండగా మధ్యలో నిలుపుదల చేసేశారు. ఫలితంగా ఏటా సాగునీటి కష్టాలు తప్పడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వాండ్రంగిలో సాగునీటి కోసం వినతుల ఇస్తున్న రైతులు, గ్రామస్తులు (ఫైల్)

పక్కనే నీరున్నా..



మా భూములను ఆనుకునే సాగునీరు వెళ్లిపోతోంది. చాలా లోతులో కాలువ ఉండటమే దీనికి కారణం. సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

– టి.రమణమ్మ, దేవరవలస, జి.సిగడాం మండలం

ఏటా ఇబ్బందులే..



మా గ్రామానికి సాగునీటి సమస్య వేధిస్తోంది. మడ్డువలస నీరు కోసం నరక యాతన పడుతున్నాం. ఇప్పటికే స్థాక ఎమ్మెల్యే ఎన్‌ఈఆర్ దృష్టికి తీసుకువెళ్లాం.కాలువను నమ్ముకుని సాగుచేస్తే కష్టాలు తప్పడంలేదు. వచ్చే ఖరీఫ్ సీజన్‌కైనా సాగునీరు అందేలా కృషి చేయాలి.

– బూరాడ శ్రీదేవి, ఎంపీటీసీ సభ్యురాలు, వాండ్రంగి

అధికారులకు విన్నవించినా..



మడ్డువలస ప్రాజెక్టు ద్వారా మా గ్రామాలకు సాగునీరు రావడం లేదు. ఈ విషయమై అధికారులకు ఇప్పటికే విన్నవించుకున్నాం. అయినా ఇంతవరకు ఎలాంటి చర్యలూ చేపట్టలేదు. దవళపేట, ఆనందపురం, సంతవురిటి గ్రామాల రైతులు ఏటా సాగునీటి కోసం కష్టాలు పడాల్సి వస్తోంది.

– పేడాడ శ్రీరామమూర్తి, దవళపేట,

సీఎం దృష్టికి తీసుకెళ్లాం..



గత నెల 30న వాండ్రంగి రైతులంతా మడ్డువలస కాలువ ద్వారా సాగునీరు అందడం లేదని ఫిర్యాదు చేసారు. ఈ నేపథ్యంలో ఈ నెల 2న సీఎం చంద్రబాబునాయుడును కలిసి నారాయణపురం ఆనకట్ట, తోటపల్లి, మడ్డువలస కాలువ సమస్యలు వివరించాను. ప్రత్యేక నిధులు నిధులు మంజూరు చేయాలని కోరాను. ఈ ఏడాది ఖరీఫ్‌కు సాగునీరు అందిస్తాం.

– నడుకుదిటి ఈశ్వరరావు, ఎమ్మెల్యే, ఎచ్చెర్ల

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



వైఎస్సార్ సీపీ రణస్థలం మండల కార్యదర్శి శ్రీనివాసరావును సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

- మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్న ప్రతిఒక్కరికీ సముచిత స్థానం లభిస్తోందని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో పార్టీ రణస్థలం మండల కార్యదర్శిగా జోగ శ్రీనివాసరావు నియమితులైన సందర్భంగా బుధవారం కిరణ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ పార్టీలో పదవులు పొందిన ప్రతిఒక్కరూ గ్రామ స్థాయిలో కార్యకర్తలు, నాయకులతో మమేకమై పని చేయాలని సూచించారు. కూటమి పార్టీలపై ఉన్న వ్యతిరేకతను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయక సీఎం చంద్రబాబు చేతులెత్తేశారనే విషయాన్ని గ్రామస్థాయిలో కూటమి నాయకులు పర్యటించినప్పుడు ఎండగట్టాలన్నారు. కార్యక్రమంలో కోటపాలెం సర్పంచ్ గొర్లె జగదీష్, ఎంపీటీసీ సుంకర కిషోర్‌కుమార్, వైఎస్సార్‌సీపీ ఎచ్చెర్ల నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు ముద్దాడ రాజశేఖర్, మండల ప్రధాన కార్యదర్శి ఇడదాసుల తిరుపతిరాజు, నాయకులు గొర్లె శశిభూషణ్ నాయుడు, డొప్ప రాము, గొర్లె అప్పలనాయుడు, ఎర్రబోలు నాగరాజు, కాయితి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళిక ప్రకారమే పెద్దమార్కెట్ నిర్మాణం



వ్యాపారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం: తన మాటే శిలా శాసనమని, పెద్ద మార్కెట్‌లో వ్యాపారుల జాబితా తయారైతే ప్రణాళిక ప్రకారం నిర్మాణం చేయడానికి ముందుకు వెళతామని ఎమ్మెల్యే గొండు శంకర్ స్పష్టం చేశారు. పెద్ద మార్కెట్ పునర్నిర్మాణ పనుల కోసం ఈ నెల 15లోగా షాపులు ఖాళీ చేయించాలని మంత్రి అచ్చెన్నాయుడు ఇటీవల అధికారులకు ఆదేశించిన నేపథ్యంలో వ్యాపారులంతా బుధవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్యేతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జాబితా తయారైన తర్వాత వ్యాపారులందరికీ స్థలాలు కేటాయింపుపై కలెక్టర్ నుంచి స్పష్టమైన హామీ వచ్చిన తర్వాతే మార్కెట్‌ను తరలిస్తామన్నారు. ఈలోగా మూడు రకాల ప్లాన్‌లు తయారు చేయిస్తున్నామని చెప్పారు. వ్యాపారుల సూచన మేరకు ఎంపిక చేస్తామన్నారు. భవిష్యత్తు తరలాకు ఉపయోగపడేలా మోడల్ మార్కెట్‌కు రూపకల్పన చేస్తామన్నారు. పెద్ద మార్కెట్ వ్యాపారులంతా సమావేశమై జాబితాను సిద్ధం చేసుకోవాలన్నారు. పైరవీలకు అవకాశం లేకుండా పారదర్శకంగా షాపుల కేటాయింపు ఉంటుందని స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ కమిషనర్ మార్కెట్‌కి వెళ్లి షాపులు ఖాళీ చేయాలని ఒత్తిడి తెచ్చారని, సమాచారం వచ్చిన వెంటనే ఆయన్ను వెనక్కి పిలిపించినట్టు తెలిపారు. సమావేశంలో వర్తక సంఘం అధ్యక్షుడు కోరాడ హరిగోపాల్, వ్యాపారులు పాల్గొన్నారు. శ్రీకాకుళం నగరంలోని నిర్మించిన బీసీ భవన్ త్వరలోనే ప్రారంభిస్తామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. బుధవారం సీ భవన్‌ను పరిశీలించారు. ఆయనతో పాటు టీడీపీ పట్టణ అధ్యక్షుడు మాదారాపు వెంకటేష్, స్థానిక నాయకులు ఉన్నారు.

త్వరలో కృత్రిమ అవయవ శిబిరం



కృత్రిమ అవయవాన్ని అందిస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు, దాతలు

శ్రీకాకుళం కల్చరల్: కలెక్టర్ అనుమతితో త్వరలోనే కృత్రిమ అవయవ శిబిరాన్ని నిర్వహిస్తామని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. పీఎన్ కాలనీలోని వరసిద్ధి వినాయక దేవాలయం ఆవరణలో అరసవల్లికి చెందిన పట్నా సత్యం అనే పేద దివ్యాంగుడికి కృత్రిమ అవయవం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృత్రిమ అవయవాలను అందిస్తున్న ఉషారాణి సేవలు నిరుపమానమని పేర్కొన్నారు. లైన్స్ క్లబ్ హర్షవల్లి సభ్యులు, దాత క్లోపల్లి ఉషారాణి మాట్లాడుతూ నిరుపేదలకు కృత్రిమ అవయవాలను ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. రెడ్‌క్రాస్ ప్రతినిధి నంది ఉమాశంకర్ ద్వారా విషయం తెలుసుకొని ఈ సాయం అందించామని పేర్కొన్నారు. వీటిని విజయనగరం గురుదేవ చారిటబుల్ ట్రస్టులో తయారు చేయించి అందిస్తున్నామని, వివరాలకు 8332836356, 9701698408 నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఉర్లాం శివతేజ, నంది ఉమాశంకర్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వినాయక మందిరానికి విరాళం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని గుజరాతిపేట తోటవీధిలో ఉన్న వినాయక మందిరం పునర్నిర్మాణానికి శ్రీపాద సురేష్, చందూ సోదరులు రూ.10,001 విరాళంగా అందించారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పన్నాల నర్సింహమూర్తి, పార్నంది విజయకుమార్, చెముడుపాటి సన్యాసిరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే మెరుగైన విద్య



సుభద్రాపురంలో సర్వే నిర్వహిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

ఎచ్చెర్ల: లావేరు మండలం సుభద్రాపురం, లావేటిపాలెం గ్రామాల్లో ఎంఈఓ వాగ్దేవి, మురళీ కృష్ణ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులు శారద, పార్వతీలు బుధవారం ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల ప్రత్యేకతలను వివరించారు. ప్రైవేటుకు దీటుగా మెరుగైన విద్యనందిస్తున్నట్లు చెప్పారు. పాఠశాలలో మౌలిక వసతులను తల్లిదండ్రులకు వివరించారు.

దళిత వాడల్లో ర్యాలీ

శ్రీకాకుళం రూరల్: జిల్లాలో ఈ నెల 14 వరకు పూలే జయంతితో పాటు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని వాడవాడలా నిర్వహించాలని కుల నిర్మూలన పోరాట సమితి ప్రతినిధి రాకోటి రాంబాబు పిలుపునిచ్చారు. చింతాడ గ్రామ దళితవాడలో బుధవారం దళిత, పీడిత కులాల ఆత్మగౌరవ పోరాట దినోత్సవంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూలే, అంబేడ్కర్‌ల ఆశయసాధనకు కృషి చేద్దామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక పోరాటాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ముచ్చ జగన్, ముక్కు రమణ, అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

సంస్థాగత విస్తరణతోనే విజయం

శ్రీకాకుళం న్యూకాలనీ : జిల్లాలో బీజేపీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి పెట్టామని, సంస్థాగత విస్తరణతోనే రాష్ట్రంలో బీజేపీ విజయాలు సాధ్యపడ్డాయని పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు అన్నారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో శ్రీకాకుళం నియోజకవర్గ క్రియాశీల సభ్యులతో అసెంబ్లీ కన్వీనర్ పైడి వేణుగోపాలం, ప్రోగ్రాం ఇన్‌చార్జి చల్లా వెంకటేశ్వరరావు అధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శవ్వాన ఉమామహేశ్వరి, డాక్టర్ పైడి సింధూర, చింతపల్లి దుర్గారావుగాంధి, పేడాడ సూర్యకుమారి, సురేష్ బాబుసింగ్, పండి యోగేశ్వరరావు, మండలాధ్యక్షులు కనుగుల లలితకుమారి, పూజారి చెల్లయ్య, మైలపల్లి లక్ష్మి జనార్దనరావు, రుప్ప బాలకృష్ణ, చింతాడ భూషణరావు, చౌదరి ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పిచ్చిమొక్కలతో పాట్లు



లావేరు మండలం బొంతుపేట కూడలి నుంచి బుడతవలస, మెట్టవలస తదితర గ్రామాలకు వెళ్లే దారికి ఇరువైపులా పిచ్చి మొక్కలు పేరుకుపోయాయి. దీంతో రాకపోకలకు వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి జంగిల్ క్లియరెన్స్ చేయించాలని పలువురు కోరుతున్నారు.

– ఎచ్చెర్ల

సీతారాముల కల్యాణానికి పందిరిరాట



శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా నగరంలోని మొండేటివీధిలో షిర్డీసాయి బాబా ఆలయ ఆవరణలో బుధవారం సీతారాముల కల్యాణోత్సవంలో భాగంగా పందిరి రాట వేశారు. 13న కల్యాణోత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

– శ్రీకాకుళం కల్చరల్

అభివృద్ధి పథంలో పయనించాలి



మహిళా సమాఖ్య సభ్యులతో మాట్లాడుతున్న భవిత మహాపాత్రో

ఎచ్చెర్ల: మండల మహిళా సమాఖ్యల ద్వారా మహిళలు అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఒడిశాకు చెందిన సంకల్ప రథ్ అసిస్టెంట్ డైరెక్టర్ భవిత మహాపాత్రో అన్నారు. బుధవారం లావేరు మండల మహిళా సమాఖ్య ప్రతినిధులతో మురపాకలో సమావేశమయ్యారు. ఆదాయాభివృద్ధి కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తామాడలో పీఎంఎఫ్‌ఎంఈ ద్వారా రుణాలు తీసుకుని వ్యాపారాలు సాగిస్తున్న వైనాన్ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సెర్ప్ ఎల్‌హెచ్ యూనిట్ ప్రతినిధి వీరశేఖరరావు, ఎస్‌ఎస్ మూర్తి, ఐబీ డీపీఎం మోహనరావు, ఎల్‌హెచ్ డీపీఎం నారాయణరావు, బ్యాంక్ లింకింగ్ డీపీఎం నాగలక్ష్మి, స్వీప్ డీపీఎం మల్లేశ్వరరావు, ధనలక్ష్మి, మండల ప్రత్యేకాధికారి శ్రీగౌరీ, ఏసీ రవికుమార్, ఎల్‌సీ నాగరాజు, ఏపీఎం బీవీ సుబ్బయ్యనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చందనోత్సవం



చాదర్ కప్పుతున్న ముస్లింలు



నోటికి శూలంతో ఉత్సవ నిర్వాహకుడు రఫీ

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని ప్రకాష్‌నగర్ కాలనీలో హజరత్ బాబా బంగేషా హుస్సేనీ రహ్మతుల్ ఆలా ఉరుసు (చందనోత్సవం) ఉత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. బాబాకు సమర్పించే చాదర్, చందనం, రోజ్‌వాటర్‌లను తలపై ఉంచి భక్తులు ఊరేగింపుగా వెళ్లారు. ఉత్సవ నిర్వాహకులు రఫీ తదితరులు శూలాధారణ చేపట్టారు. అనంతరం దర్గాలో ఉన్న బాబా సమాధిపై చాదర్ కప్పి పూలు వేసి ప్రార్థనలు చేశారు. ఖురాన్ పఠనం, ఆధ్యాత్మిక ప్రసంగం అనంతరం లంగరు విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దర్గా ముతవల్లి ఎం.ఎ.రఫీ, సుల్తాన్, అబ్దుల్ వహాబ్, అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

పౌష్టికాహారమే అత్యుత్తమ వ్యాక్సిన్



జి.సిగడాం అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార ప్రదర్శన



రణస్థలం: కొవ్వాడలో వైద్యసేవలు అందిస్తున్న సిబ్బంది



ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడలో పౌష్టికాహారంపై అవగాహన

జి.సిగడాం: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సకాలంలో పౌష్టికాహారం తీసుకుంటే అద్భుతమైన వ్యాక్సిన్‌లా పనిచేస్తుందని, పుట్టిన బిడ్డకు వెంటనే తల్లి ముర్రిపాలు పెడితే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఎచ్చెర్ల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తమ్మినేని లక్ష్మి అన్నారు. బుధవారం జి.సిగడాం అంగన్‌వాడీ–2లో పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. పోషణ్ పక్వాడాలో భాగంగా కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేస్తున్న పలు వస్తువులతో పౌష్టికాహార ప్రదర్శన ఏర్పాటు చేశారు.కార్యక్రమంలో సీహెచ్‌ఓ శివప్రసాద్, ఏఎన్‌ఎం కె.పద్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు శిల్లా భారతి, ఆశా కార్యకర్తలు రాము, రమణమ్మ, ఉషా తదితరులు పాల్గొన్నారు.

– రణస్థలం: గర్భిణులు, బాలింతలు, ఆరేళ్లలోపు చిన్నారుల ఆరోగ్యం ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని రణస్థలం సెక్టార్ సీడీపీవో సీహెచ్ ఝాన్సీ తెలిపారు. పోషణ్ పక్వాడా–2025 కార్యక్రమంలో భాగంగా రణస్థలం శిశు అభివృద్ధి ప్రాజెక్టు ఆధ్వర్యంలో కొవ్వాడ మత్స్యలేశం గ్రామ సచివాలయం వద్ద వైద్య శిబిరం నిర్వహించారు. విజయనగరం మహారాజా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ కాలేజీ వైద్యులు హాజరై రక్త నమూనాలు, సుగర్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మిమ్స్ మేనేజర్ కృష్ణకాంత్, సూపర్‌వైజర్ టి.మంగమ్మ, పంచాయతీ కార్యదర్శి జీవన్, హెల్త్ సిబ్బంది, గ్రామపెద్దలు ఉన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: పౌష్టికాహారంపై గర్భిణులకు, చిన్న పిల్లల తల్లులకు అవగాహన కల్పించాలని ఎచ్చెర్ల మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు అధికారి డి.పాపినాయుడు సిబ్బందికి సూచించారు. పొన్నాడ, లావేటిపాలెం, కేశవరావుపేట, రుప్పపేట అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల పోషణలో మొదటి 1000 రోజులు కీలకమని చెప్పారు. ఆరోగ్యకరమైన జీవన శైలి, తృణ ధాన్యాలు, పప్పులు, తాజా కూరగాయలు, పండ్లు, మాంసాహారం, పాలును ఆహారంలో భాగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు అరుణకుమారి, శరణ్య తదితరులు పాల్గొన్నారు.